క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వక్తృత్వపు పోటీల్లో పాల్గొన్న మేఘన



వైఎస్సార్ జిల్లా డీఈఓ మీనాక్షి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న మేఘన

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.మేఘన రాష్ట్రస్థాయి వక్తృత్వపు పోటీల్లో పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, పీడీ రామాంజినేయులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ కనబరిచి మంగళవారం కడపలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని కడప జిల్లా డీఈఓ మీనాక్షి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు రోజ్ మెర్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల ద్వారా రూ.7.13 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 13 నుంచి 19 వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయాల్లో భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.2,35,729 లక్షలు, భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.4,77,618 లక్షలు, రూ.11 యూఎస్ఏ డాలర్లు వచ్చాయని ఈఓ నరసింహరాజు తెలిపారు. నాలుగు నెలలకు సంబంధించి హుండీల కానుకల లెక్కింపు ద్వారా రూ.7,13,347 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు సద్వినియోగం చేసుకోండి



రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలోని రైతులు డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. మంగళవారం యాదవ కల్యాణ మండపంలో రైతులకు ఆయన డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎంఐఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు



వలస గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ జగదీష్

అమరాపురం: మండలంలోని వలస, వి.అగ్రహారం, ఆలదపల్లి, హేమావతి గ్రామ సచివాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనుల ప్రణాళికపై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ జగదీష్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనులను ఆమోదించడం కోసం గ్రామసభ నిర్వహించామన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి వాటి ఆమోదం కోసం గ్రామసభలో తీర్మానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామ సభలో వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచులు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి, జైరేపల్లి, మందలపల్లి చెరువుల్లో చేపల పెంపకానికి బుధవారం ఉదయం 11 గంటలకు ఆయా గ్రామ సచివాలయ ఆవరణాల్లో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ నాగరాజునాయక్ తెలిపారు. ఆసక్తి కలవారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. అయితే పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదన్నారు. ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట అకాల వర్షాలకు దెబ్బతినింది. దీంతో అన్నదాతలు నష్టాలను చవిచూశారు. ఇదిలా ఉండగా వేరుశనగలో అంతర పంటగా సాగు చేసిన కంది పంట తుపాను, వర్షాల ధాటికి దెబ్బతినడంతో కర్షకులు కన్నీరు మున్నీరవుతున్నారు. పెట్టుబడి కూడా దక్కలేదని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



మద్దనకుంట వద్ద సాగు చేసిన కంది పంట



దిగుబడి లేకపోవడంతో తొలగించిన కంది

- రైతులకు నిరాశ మిగిల్చిన కంది పంట
- మడకశిర నియోజకవర్గంలో 6,337 ఎకరాల్లో సాగు
- పెట్టిన పెట్టుబడి కూడా దక్కలేదని అన్నదాతల ఆవేదన

కంది పోయింది

అమరాపురం: రైతులకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం, మడకశిర, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో గతేడాది కంటే ఈ ఏడాది కంది పంటను రైతులు వేరుశనగలో అంతర పంటగా సాగు చేశారు. మార్కెట్లో కంది ధరలు అధికంగా ఉండటంతో పాటు కుటుంబ అవసరానికి వాడుకుందామని వేరుశనగ సాగు చేసిన ప్రతి రైతు కంది సాగు చేశాడు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 6,337 ఎకరాల్లో సాగు పంట సాగైంది. పంట కూడా ఏపుగా పెరగడంతో రైతులు దిగుబడి బాగుంటుందని ఆశ పడ్డారు.

నిండా ముంచిన వానలు

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెల మొదటి వారంలో తుపాను, వరుస వర్షాలు కురవడంతో కంది పంటలో ఉన్న పూలు పిందెలు రాలిపోయాయి. దీంతో కంది ఏపుగా పొలంలో కనబడుతుందే తప్ప అందులో కాయలు పెద్దగా లేవని రైతులు వాపోతున్నారు. కొంత మంది రైతులు ఉన్న కాయలే చాలని కోత కోస్తున్నారు. అంతర పంటగా సాగు చేసిన కందికి ఎకరాకు రూ.10 వేలు, నేరుగా సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చుపెట్టారు. పంట రాకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు వేరుశనగ ఇప్పటికే నష్టపోగా తాజాగా కంది పంట కూడా రాకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో కంది సాగు ఇలా..	
మండలం	సాగైంది (ఎకరాల్లో)
మడకశిర	3,270
అమరాపురం	1239
గుడిబండలో	1140
రొళ్లలో	375
అగళిలో	313

కందిలో కాయలు లేవు



వేరుశనగ పంటలో అంతర పంటగా సాగు చేసిన కంది పంటలో కేవలం ఆకులు, కట్టె మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే కాయలు కనబడడం లేదు. గతంలో కురిసిన వర్షానికి మొత్తం కందికి ఉన్న పిందెలు, పూత రాలిపోయింది. వేరుశనగ పంట మాత్రమే నష్టపోయిందనుకుంటే ఇప్పుడు కంది కూడా నష్టపోవడంతో అన్ని విధాలా కోలుకోలేని దెబ్బపడింది. పరిహారమిచ్చి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

– మురళి, గౌదనకుంట, అమరాపురం మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఖరీఫ్‌లో అధిక వర్షాలు కురవడంతో వేరుశనగ పంటతో పాటు అంతర సాగు చేసిన కంది పంట కూడా తీవ్రంగా దెబ్బతింది. దీంతో రైతులందరూ చాలా నష్టపోయాము. నాకున్న ఐదెకరాల్లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. అందులో అంతర పంటగా కంది సాగు చేశా. వేరుశనగ పంట పూర్తిగా వర్షానికి దెబ్బతినగా కంది కూడా దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయాను. రూ.50 వేలకు పైగా ఖర్చు పెట్టా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మంజునాథ, దేవగానపల్లి, అమరాపురం మండలం

బాధిత కుటుంబానికి పరామర్శ



గౌరమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ కాలువపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, లాయర్ వన్నేరువప్ప మాతృమూర్తి గౌరమ్మ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మంగళవారం కాలువపల్లికి వెళ్లారు. గౌరమ్మ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వన్నేరువప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ సాకమ్మ, ఎంపీటీసీలు చిక్కన్న, మారుతీరెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజి, గిరి, క్రిష్టప్ప, గంగాధర్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

డిజిటల్ పేమెంట్లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వీధి వ్యాపారులకు డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించారు. ప్రధానంగా పీఎం స్వానిధి పథకం కింద మంజూరైన రుణాలు, పెండింగ్ రుణాలు, యాప్ డౌన్‌లోడ్, కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో గ్రామ సచివాలయ సిబ్బందికి చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు వనరులపై సర్వే చేయాలని, ఈ సర్వే పకడ్బందీగా జరగాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సోమందేపల్లిలో మధ్యాహ్నం వేళ లారీ లైట్లు వేసుకొని వెళ్తున్న డ్రైవర్



చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి వద్ద పొగమంచు

రోజంతా ముసురు..

సాక్షిబృందం: తుపాను ప్రభావంతో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రోజంతా ముసురు పట్టింది. చిరు జల్లులతో కూడిన వర్షంతో పాటు పొగ మంచు కారణంలో మధ్యాహ్నం నుంచే వాహనదారులు రోడ్డు కనిపించక లైట్ల వేసుకొని వెళ్లారు. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు చలికి వణికిపోయారు.



హిందూపురం: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కురుస్తున్న జడివాన

లారీని ఢీ కొన్న ఐచర్

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని జాతీయ రహదారి 44పై మంగళవారం సాయంత్రం లారీని ఐచర్ వాహనం ఢీ కొంది. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ హరిపురం స్పీడ్ బ్రేకర్ల వద్ద స్లో అయింది. వెనుకగా వచ్చిన ఐచర్ వాహనం లారీ ఢీ కొట్టింది. ఐచర్ ముందు భాగం దెబ్బతింది. ట్రాఫిక్ స్తంభించకుండా ఎస్ఐ రాజేష్ వెంటనే దెబ్బతిన్న వాహనాన్ని క్రేన్ సహాయంతో తీయించారు.



హిందూపురం: పట్టణంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ



మడకశిర: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం



హిందూపురం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అగళి: మండలంలోని పీ.బ్యాడగేరలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు



మడకశిర: గుండుమల పాలిటెక్నిక్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సాక్షిబృందం: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని వక్తలు కొనియాడారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, కోర్టులు తదితర చోట్ల భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మడకశిరలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచంలో భారత రాజ్యాంగానికి ఎంతో గౌరవం ఉందని ఆయన పేర్కొన్నారు. అన్ని దేశాలు భారత రాజ్యాంగాన్ని మెచ్చుకుంటున్నాయని తెలిపారు. దేశ పౌరులు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. హిందూపురంలోని బాలాజీ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులు జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ మాట్లాడుతూ భారతీయులందరూ రాజ్యాంగ స్ఫూర్తిని నింపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పౌరులందరూ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. అలాగే పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, మండల కన్వీనర్ రాము తదితరులు భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డితో పాటు అధికారులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలో ఎమ్మార్పీఎస్, లైఫ్ వర్ల్డ్ చారిటబుల్‌ట్రస్టు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, బీఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు వేర్వేరుగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించాయి. అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.



హిందూపురం: మున్సిపల్ ఆఫీసులో ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో..



పెనుకొండ: అంబేడ్కర్‌కు జై కొడుతున్న దళిత సంఘాల నాయకులు



పరిగి : సచివాలయం-1లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

చింత ఫలసాయం వేలం

రొళ్ల: మండల పరిధిలోని రంగనపల్లి చింతఫల సాయాన్ని మంగళవారం సర్పంచ్ అనిత అధ్యక్షతన వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. తిమ్మారెడ్డి అనే వ్యక్తి రూ.66 వేలకు చింత ఫల సాయాన్ని దక్కించుకొన్నారని పేర్కొన్నారు. తాలూకా జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

చిలమత్తూరు: మండలంలో రబీలో పంటలు సాగు చేసిన రైతులకు పంటల బీమా చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందని ఏఓ వంశీకృష్ణ అన్నారు. వరి పంటకు రూ.630, వేరుశనగకు రూ.480, టమాటా పంటకు రూ.1600 చెల్లించాలని రైతులకు సూచించారు. రబీలో పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

మహిళలను గౌరవిద్దాం



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

రొళ్ల: సమాజంలో ప్రతి ఒక్కరూ కూడా మహిళలను గౌరవించాలని ఇన్‌చార్జ్ ఏపీఎం భీమరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో లింగ వివక్షత నిర్మూలనపై మహిళ సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పనులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేష్ కృష్ణ

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండలో మంగళవారం ఎంపీడీఓ నరేష్ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద పంచాయితీలో పంట కాలువ పూడిక తీత పనులు, ఫారంపాండ్స్, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, చెరువు గట్లపై ముళ్ల కంపల తొలగింపు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ గౌతమి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. జయమంగళీ, పెన్నా నదుల నుంచి మంగళవారం ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

ఉప ఎన్నికల్లో జేడీఎస్ విజయభేరి

పావగడ: తాలూకా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న నాలుగు గ్రామ పంచాయతీల సభ్యత్వ స్థానాలకు ఈ నెల 23న జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. తాలూకా కార్యాలయంలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో మొత్తం నాలుగు సభ్యత్వ స్థానాల్లో మూడు సభ్యత్వ స్థానాలను జేడీఎస్ దక్కించుకుంది. ఒక స్థానంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కొడమడుగు స్థానంలో హనుమంతరాయ, సూలనాయకనహళ్లి స్థానంలో నరసప్ప, బ్యాడనూరులో రాజశేఖర్ జేడీఎస్ నుంచి విజయం సాధించారు. క్యాతగానహళ్లి నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన లలిత గెలుపొందారు. గెలుపొందిన వారికి ఆయా పార్టీల నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పాలసముద్రం వైపు నుంచి సోమందేపల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బెంగళూరు వైపు నుంచి వస్తున్న ఐచర్ ఢీ కొంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో రెండు ద్విచక్ర వాహనాలు మంగళవారం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మొరసలపల్లికి చెందిన శ్రీనివాస్‌తో పాటు రామగిరి మండలానికి చెందిన వ్యక్తిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ జనార్దన్, ఎస్ఐ మునీర్ అహ్మద్ దగ్గరుండి క్షతగాత్రులను 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు.